
# హారతి పళ్ళెం

★

* రచన : శ్రీ యల్. రాజాగణేష్ *



ప్రతి అణువూ అతి విలువల్ని సంతరించుకున్న అతనిగదిలో అడుగు పెట్టింది సీత. సిగరెట్ కాలుస్తూ ఏదో ఆలోచిస్తున్న కృష్ణమోహన్ ఆమెను ఆశ్చర్యంగా చూస్తూ, కన్నార్పకుండా ఉండిపోయాడు. సీత నిర్వికారంగా అలాగే నిలుచునే ఉంది.

ఎర్రని శరీరంతో, తెల్లచీర కట్టుకున్న ఆమె పొట్లాం కట్టిన అందంలా ఉంది. అందమైన ముఖవర్చస్సుతో, నుదుటి మీద నయాపైసంత బొట్టుతో, ఒకవిధమైన ఆకర్షణతో నిండుగా పార్వతీదేవిలా ఉంది. హృదయగతమైన సంస్కారమేదో ఆమె ధోరణిలో స్పష్టంగా కనిపిస్తుంది. ఆమె బాహ్యసౌందర్యాన్ని జుర్రుకుంటున్నట్టు కన్నార్పకుండా చూస్తూనే ఉన్నాడు కృష్ణమోహన్. ఆమె నిర్వికారంగా అలాగే నిల్చుంది.

ఒకప్పుడతణ్ణి తిరస్కరించిన సీత, అతని ముఖం మీద కాండ్రించి ఉమ్మినసీత, అతనిగదికి కావాలని అర్ధరాత్రి మరీ వస్తే ఆనందంకాక మరేవిటి? కానీ ఆమె నిర్లిప్తతకు కారణం ఏవిటో? ఏదేమైనా–

“రాణిగారికి ఇన్నాళ్ళకు దయకలిగిందన్న మాట, నాకు తెల్సు ఏదో ఒకనాడు నీకు నువ్వుగా నేను కావాలని వస్తావని, నాకెప్పుడో తెల్సు ఇలారా...” హూందాగా, పురుషసహజమైన అహంతో అన్నాడు కృష్ణమోహన్.

ఊహూ! సీత కదలనూ లేదు మెదలనూ లేదు.

“ఇలారా! ఇలా వచ్చి కూర్చో...” మళ్ళీ తనే పిల్చాడు.

లేదు, ఆమెలో ఏమాత్రపు కదలికా మచ్చుకైనా లేదు.

చివరికి తనే కదిలాడు. ఆమె దగ్గరగా చేరాడు. ఎడం భుజం మీద తలాన్చి కుడి భుజంపై చెయ్యేసి, ఆమెపై పూర్తిగా వాలిపోయాడు. ‘నారాణీ...రోజా...రాజీ...’ గొణిగాడు. “మాట్లాడవేం?” ప్రశ్నించాడు. నెమ్మదిగా నడిపించుకుంటూ వెళ్ళి మంచంపై కూర్చోపెట్టి, భుజాలపై చేతుల్ని గుండెలపైకి జార్చాడు. ఓరగా ఆమె ముఖంలోకి చూశాడు.

మౌనంగా, సిద్ధిపొందిన యోగినిలా ఉందామె. ఒళ్ళప్పగించేసి కళ్ళుమూసుకు కూర్చుందామె. ఆమె గుండెలు తడుముతూంటే చేతికి తలిగిన పసుపుతాడు పట్టుకులాగాడు కృష్ణమోహన్. కళ్ళు తెరిచిందామె.

“నీ మొగుడంటే మోజు తగ్గిపోయిందా?” ప్రశ్నించాడు తను.

"లేదు"

"మరినీ...అదే...వాడు నిన్నొదిలేశాడన్న మాట"

"లేదు..."

"మరి?...మరేవిటి?"

"ఓహ్! వాడూ నేనూ కూడా కావాలన్న మాట" కొంటెగా నవ్వాడతను.

"కాదు కాదు, కానే కాదు" కాస్తంత హెచ్చుగా మాట్లాడిందీసారి సీత.

"మరి......" ప్రశ్నార్థంగా చూశాడతను.

"నాకు డబ్బు కావాలి. అంతే!"

డబ్బు అందరికీ కావాలి. అది అందరికీ ముఖ్యమే! ఆనాడు కోరి డబ్బిస్తే కాదని విసిరి కొట్టావ్ పెద్ద పతివ్రతలా, ముఖం మీద కాండ్రించి ఉమ్మావ్. అప్పట్లేని అవసరం ఇప్పుడేవిటో? ఊ! చెప్పుమరి!"

పట్టరానికోపం వచ్చినా, సీతకి మౌనం వహించక తప్పలేదు.

సీత మౌనంతో, అతని హృదయంలో ఏమూరు మూలో దాగిన పిసరంత మృధుత్వం మెల్లగా కదిలింది. ఎంతకీ మాట్లాడక పోవడంతో అతనే మళ్ళీ కల్పించుకుని—


"నువ్వేదో బాధల్లో ఉన్నట్టున్నావ్! అందుకే డబ్బు చాలా అవసరం అన్నావ్. పోనీ...ఎందుకో చెప్పు నీక్కావల్సినంత డబ్బిస్తాను." అన్నాడతను.

"అవన్నీ మీకెందుకు? మీరు రసికులు పైగా ధనికులు, నేనో వ్యభిచారిని నాకు డబ్బు కావాలి మనిద్దరి మధ్యా మరే అవగాహనకూ తావులేదు. మీపని మీరు కానివ్వండి డబ్బిచ్చిపుణ్యం కట్టుకోండి" క్రమక్రమంగా ఎక్కువగా మాట్లాడిందామె.

"అలా అంటే కాదు. నీక్కావల్సిన సహాయం చేస్తాను. నీ బాధేవిటో చెప్పు నీ అవసరవేవిటో చెప్పు" గెడ్డం పట్టుకు బ్రతిమాలాడు తను.

మామూలుగా నవ్విందామె తలవాల్చేసుకుని, నీళ్ళు నిండిన కళ్ళు చాటు చేసేసుకుని ఇలా చెప్పిందామె "మా ఆయనకు క్షయని డాక్టరు చెప్పారు. మంచి ఆహారం, మంచి మంచి మందులూ ఇవ్వాలట, అతన్ని పూర్తిగా విశ్రాంతీ తీసుకో నివ్వాలట నాకు వెంటనే డబ్బు కావాలి అతని ప్రాణం నిలుపుకోవాలి మాబోటోళ్ళకి అప్పులు మాత్రం ఎవరిస్తారు? ఇంతకంటే వేరే మార్గంపది?"

"మీ ఆయనకోసం వ్యభిచరిస్తున్నట్టు ఆయనకి తెల్సా?"



"తెలీదు"

"ఒకవేళ తెలిస్తే?"

"తెలుస్తుంది. ఎందుకు తెలీదూ? తప్పక తెలుస్తుంది. అతను కోలుకున్నాక నేనే చెప్తాను అప్పుడైనా అతనికి తెలిసే తీరుతుంది."

"మరి...ఆ తర్వాత...నువ్వు చెడిపోయిందానివని పొమ్మంటే...వదిలేస్తే...లోకమంతా నిన్ను చీదరించుకుంటే...ఏంచేస్తావ్?"


"దేనికైనా సిద్ధమే! అతను నన్నొదిలేసినా, సంఘం నన్ను వెలివేసినా, ఏదెలా జరిగినా జరగనివ్వండి. అతని ప్రాణం నిలుపుకోవాలి, అతను బ్రతకాలి, బ్రతికితీరాలి, ఆ తర్వాత నేనేమైపోయినా పర్లేదు అతని ప్రాణం నిలుపుకోవాలి అంతే!" అంటూనే మంచం మీద ఒరిగిపోయి, కృష్ణమోహన్ చేయిపట్టిలాగిందామె.

తరతరాల భారతస్త్రీ చరిత్ర అతనికళ్ళ ముందు కదలాడింది. సీత ఒక పవిత్ర దేవతామూర్తిలా కనిపించి, రెండడుగులు వెనక్కివేశాడు కృష్ణమోహన్. తన హద్దు తనకు తానుగా గ్రహించాడు కృష్ణమోహన్.

స్త్రీ మనసుకి ఎల్లలుకానీ, హద్దులుకానీ, సరిహద్దులుకానీ ఉన్నాయా?

ఇది ఎన్నటికీ చిక్కుచెదరని పురాతన భారత స్త్రీత్వం. ఇది వర్తమానం.

Grams: "SHIVAJITEX" Phone; 23616




T. MARIMUTHU
Handloom Weaving Factory
SELLUR, MADURAI-625 002

టి. మారిముత్తు
హేండ్‌లూమ్ వీవింగ్ ఫ్యాక్టరీ,
సెల్లూర్ : : మధురై - 625 002.